నమస్తే తెలంగాణ

## ఈ నెల 30న లోక్ అదాలత్

అందోల్, డిసెంబర్ 21 : లీగల్ సర్వీస్ కమిటీ జోగిపేట ఆధ్వర్యంలో స్టేట్, జిల్లా లీగల్‌సెల్ అథారిటీ ఆదేశాల మేరకు ఈ నెల 30న జోగిపేట కోర్టులో నేషనల్ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రెటరీ హనుమంతరావు తెలిపారు. గురువారం జోగిపేట కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాజీపడేందుకు వీలుగా ఉన్న కేసులు ఇందులో పరిష్కరించుకోవాలన్నారు. భార్యాభర్తల కేసులు, భూములు, బ్యాంక్ సివిల్ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునే వీలును లోక్‌అదాలత్‌లో కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోగిపేట జడ్జి ధనలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి, సభ్యులు శ్రీకాంత్, నారాయణరెడ్డి, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న బియ్యం స్వాధీనం

న్యాల్‌కల్, డిసెంబర్ 21 : అక్రమంగా తరలిస్తున్న 20క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు జహీరాబాద్ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సాయిరవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మల్గి గ్రామం మీదుగా డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గ్రామస్తులు పట్టుకుని హద్నూర్ పోలీసులకు అప్పగించారు. హద్నూర్ ఎస్ఐ రామానాయుడు పట్టుకున్న డీసీఎంలోని బియ్యం బస్తాలను గురువారం తమకు అప్పగించారని, వాటిని సివిల్ సప్లై గోదాంకు తరలించినట్టు తెలిపారు. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నటు పేర్కొన్నారు. ఆయన వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుర్గయ్య ఉన్నారు.

## క్రీడలతోనే కొత్త పరిచయాలు

మునిపల్లి, డిసెంబర్ 21: క్రీడలతోనే కొత్త పరిచయాలు ఏర్పడుతాయని తాటిపల్లి సర్పంచ్ అంజిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తాటిపల్లిలో వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాపోటీల్లో నిర్వాహకుల నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. టోర్నమెంట్లో మొత్తం 50జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. తాటిపల్లిలో నిర్వహించే టోర్నమెంట్లో పాల్గొనే జట్లకు నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, నిర్వాహకులు ఉన్నారు.

## 28న సదరం శిబిరం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 21: ఈ నెల 26న జరగాల్సిన సదరం శిబిరాన్ని 28న స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో నిర్వహించనున్నట్టు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ గాయత్రీదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్లాట్స్ ఈ నెల 22న శుక్రవారం కేటాయిస్తారన్నారు. మీసేవ ద్వారా స్లాట్స్ బుక్ చేసుకొని హాజరు కావాలని సూచించారు. సదరం శిబిరానికి హాజరయ్యే స్లాట్స్ బుకింగ్ రసీదు తప్పనిసరని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, పాస్‌ఫొటో సంబంధిత మెడికల్ రిపోర్ట్స్ తప్పనిసరి అని స్పష్టం చేశారు.

## జిల్లెల వాగును పరిశీలించిన అధికారులు

జిన్నారం, డిసెంబర్ 21: ఖాజీపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 180 ప్రభుత్వ భూమిలోని జిల్లెల వాగు కాలువను, నిర్మాణాలను ఇరిగేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. ఇరిగేషన్ ఈఈ మధుసూదన్ రెడ్డి, ఏఈ దిలీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి జిల్లెల వాగు కాలువను పరిశీలించారు. రికార్డుల ప్రకారం.. పూర్తి వివరాలు పరిశీలిస్తున్నామని వారు తెలిపారు. జిల్లెల వాగు కాలువ హద్దులు మార్చినట్లు తేలితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## అర్ధరాత్రి దొంగల హల్‌చల్

అందోల్, డిసెంబర్ 21: జోగిపేట పట్టణంలో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. పట్టణానికి చెందిన కాటిగర్ సుభాశ్ ఇంటికి తాళం వేసి దవాఖానకు వెళ్లారు. గమనించిన దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారం, వెండి నగలతో పాటు నగదును ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం, ఇంట్లో సామన్లు చిందర.. వందరగా పడి ఉండటంతో పక్కింటి వారు సుభాశ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు జోగిపేటకు చేరుకుని ఇంట్లో చోరీ జరిగినట్లు గుర్తించి జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

అందోల్, డిసెంబర్ 21: అనారోగ్య సమస్యలకు తోడు ఆర్థిక ఇబ్బందులు అధికమవ్వడంతో వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పోసానిపేట్‌లో గురువారం జరిగింది. ఆత్మహత్యకు సంబంధించి జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పోసానిపేట్ గ్రామానికి చెందిన గంట గోపాల్(40) కొన్ని రోజులుగా అనారోగ్యంతోపాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. అందులో ఒకరు వికలాంగుడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# రాష్ట్రస్థాయి క్రీడలకు గురుకుల విద్యార్థులు ఎంపిక

జిన్నారం, డిసెంబర్ 21: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జిన్నారం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు గురువారం ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్ 17కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు పాఠశాలకు చెందిన లక్ష్మణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అండర్ 14 కబడ్డీ జట్టుకు అరుణ్ ఎంపికయ్యారు. టెన్నిస్‌బాల్ క్రికెట్ జట్టుకు విక్రమ్ సింగ్, అభిషేకర్, విక్రమ్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ, క్రికెట్ జట్లకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.




రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ద్వితీయ బహుమతి అందుకుంటున్న జిన్నారం గురుకుల పాఠశాల విద్యార్థులు

**బాస్కెట్‌బాల్ పోటీలో రెండో స్థానం**

తెలంగాణ ఇన్‌ట్రా హై5 లీగ్ 2023–24 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో జిన్నారం గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు రెండోస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. గెలుపొందిన జట్టుకు హై5 ఫౌండర్స్ సుందర్, ఉషా ట్రోఫీని అందజేశారు. రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో రెండోస్థానం సాధించిన పాఠశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి, కోచ్ బాలరాజు, సంతోశ్, పీడీ, ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు.

## నేడు పటాన్‌చెరుకు హరీశ్‌రావు రాక

పటాన్‌చెరు, డిసెంబర్ 21: పటాన్‌చెరుకు బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే హరీశ్‌రావు రానున్నారు. పటాన్‌చెరు బీఆర్‌ఎస్ శ్రేణులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి కృతజ్ఞత సభను పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగే కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా హరీశ్‌రావు హాజరవుతున్నారు. ఉదయం 10గంటలకు జీఎం ఆర్ ఫంక్షన్‌హాల్‌లో కార్యక్రమం నిర్వహిస్తున్నామని పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

## దవాఖానలో క్రిస్మస్ వేడుకలు

కోహీర్, డిసెంబర్ 21 : మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నవీన్‌కుమార్, ఎంపీహెచ్‌ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఆయ గ్రామాల వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థినులకు కూచిపూడి శిక్షణ



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న కూచిపూడి నాట్య గురువు షణ్ముఖి

రామచంద్రాపురం, డిసెంబర్ 21: భెల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు కూచిపూడి నృత్యంపై శిక్షణ ఇస్తున్నారు. నల్లగండ్లలోని కూచిపూడి నృత్య అకాడమీ వ్యవస్థాపకురాలు, కూచిపూడి నాట్య గురువు శాంతంగారి షణ్ముఖి ఆధ్వర్యంలో భెల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థినులకు స్తోత్రాలతో శిక్షణనిచ్చి మెళుకువలను నేర్పించారు. విద్యార్థినులకు ఉచితంగా కూచిపూడి శిక్షణ ఇస్తుండటంతో విద్యార్థినులు సంబురపడుతున్నారు. ఈ సందర్భంగా షణ్ముఖి మాట్లాడుతూ కూచిపూడి నృత్యంపై పేద విద్యార్థినులకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు.

# పూల సాగు.. లాభాలు బాగు

న్యాల్‌కల్, డిసెంబర్ 21: మండలంలోని చాలా మంది రైతులు నిత్యం ఆదాయం సమకూర్చే పంటలపై దృష్టి సారిస్తున్నారు. బోరు సౌకర్యం ఉన్న రైతులు ఎక్కువగా చెరుకు, అల్లం, పసుపు, అరటి, మామిడి, ఉసిరి తదితర పంటలను పండిస్తున్నారు. ఎప్పుడూ ఒకే రకమైన సంప్రదాయ పంటలను సాగు చేస్తే లాభాలు రావని గ్రహించిన రైతులు, అధిక లాభాలు వచ్చే అరుతడి పంటలు ఎంచుకుని సాగు చేస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాల మేరకు మార్కెట్‌లో పూలు, కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో వీటిని సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మండల పరిధిలోని హద్నూర్, న్యాల్‌కల్, చీకూర్తి, చాల్కి, ఖలీల్‌పూర్, న్యామతాబాద్, రుక్మాపూర్, మిర్జాపూర్(ఎన్), ముంగి, మెటల్‌కుంట, గంగ్వార్, న్యామతాబాద్, హుసేల్లి, మామిడ్గి, రాజోలా తదితర గ్రామాల్లోని తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయాన్ని ఇచ్చే ఉద్యానవన పంటలను సాగు చేస్తూ లాభాలను గడిస్తున్నారు. ఆయా గ్రామాల్లో రైతులు తమ పొలాలు, ఫాలీహౌస్‌లలో తక్కవ పెట్టుబడితో ఎక్కవ అదాయం వచ్చే బంతి, చామంతి, గులాబీ తదితర పూలను సాగు చేస్తున్నారు. పండుగలు, పెండ్లిండ్లు, ఫంక్షన్లను దృష్టిలో పెట్టుకుని రైతులు అర ఎకరం నుంచి రెండు, మూడు ఎకరాల వరకు మొక్కలు నాటి పెంచుతున్నారు. రైతాంగం స్థానిక అవసరాల మేరకు మార్కె ట్ గిరాకీ ఉండడంతో తక్కువ పెట్టుబడితో పూలు సాగు చేస్తూ ఎక్కవ లాభాలను గడిస్తున్నారు.



## విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కంది, డిసెంబర్ 21 : విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కంది జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత లోపం తలెత్తకుండా బలమైన ఆహారం తీసుకోవాలని, ఎదిగే వయస్సులో శరీరంలో ఐరన్ లోపించకుండ జాగ్రత్తలు పాటించాలని వివరించారు. వైద్య సిబ్బంది విద్యార్థుల కు రక్త పరీక్షలు నిర్వహించి హీమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్నవారికి ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో చంద్రకళ, డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగజ్యోతి, కంది మెడికల్ ఆఫీసర్ రమ, సుధారాణి, ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, పాల్గొన్న అధికారులు

## కొల్లూర్‌కు ఆర్టీసీ బస్సు

రామచంద్రాపురం, డిసెంబర్ 21 : తెల్లాపూర్ మున్సిపాలిటీలోని కొల్లూర్ వరకు సిటీ ఆర్టీసీ బస్సు రూటు మంజూరు అయిందని తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ గురువారం తెలిపారు. సంవత్సర కాలంగా తెల్లాపూర్ మీదుగా ఆర్టీసీ బస్సు నడిపించాలని టీనా ఆధ్వర్యంలో ఆర్టీసీ సంబంధిత అధికారులను కోరడంతో పాటు వినతిపత్రాలను సమర్పించగా, ఇన్ని రోజులకు సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి తెల్లాపూర్ మీదుగా కొల్లూర్ వరకు ఆర్టీసీ బస్సులు నడిపిస్తారని టీఎస్ ఆర్టీసీ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. సీబీఎస్ నుంచి కొల్లూర్ వరకు సిటీ బస్సులు నడుస్తాయన్నారు. మొదటి బస్సు సీబీఎస్ నుంచి ఉదయం 6 గంటలకు మొదలై 7:45 గంటలకు కొల్లూర్‌కు చేరుకుంటుందని తెలిపారు రాత్రి చివరి బస్సు కొల్లూర్ నుంచి సీబీఎస్‌కు 9:40గంటలకు ఉంటుందన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రజల కోరికను టీఎస్ ఆర్టీసీ పరిష్కరించడం చాలా సంతోషంగా ఉన్నదని ఆయన తెలిపారు.

## మగ్గం, ఎంబ్రాయిడరీ వర్క్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 21: స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి కల్పన శిక్షణ కేంద్రం (ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ)లో మగ్గం, ఎంబ్రాయిడరీ వర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌బీఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ వంగా రాజేంద్రప్రసాద్ గురువారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 18నుంచి 45 సంవత్సరాల మధ్య ఉన్నవారు అర్హులన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంత మహిళాలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మున్సిపల్‌లోని మహిళలు శిక్షణకు అర్హులు కారని స్పష్టం చేశారు. అయితే ని వాస ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, 4 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు సమర్పించాలన్నారు. ఈ నెల 26నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఉచిత శిక్షణతో పాటు శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9704446956, 9490129839 ను సంప్రదించాలన్నారు.